# రాజుగారి పిల్లి

– వి. రామలక్ష్మి

**నాకు నాలుక మీద వెంట్రుక వున్నట్టుంది. తీయాలి. ప్రయత్నం. సమావేశం సంతోష ప్రకటనలతో మొదలయ్యిందగ్గర్నుంచి నిన్న పేపర్లో మెయిన్ న్యూస్‌ని ప్రచురించడంలో ధైర్యం చూపిన ఎడిటర్‌కీ, దాన్ని అంత బాగా రాసిన మా సహోద్యోగికీ అభినందన చందనాల సందోహాలు.**

మీటింగిలా అంతా సీరియస్‌గా వున్నారు.

పత్రిక పాలసీ గురించి చర్చించాలన్నది ఎడిటర్ పాలసీ. నెలకోమారు సంపాదకవర్గ సభ్యులందరూ హాజరవుతారు. దాన్ని 'క్వాలిటీ సర్కిల్' అంటాడు జోరాన్ని ప్రేమించే ఎడిటర్. ఎంత తెలివి తక్కువగా కనిపించే ఆలోచనయినా చెప్పవచ్చుట. దాన్ని సీరియస్‌గా పట్టించుకోవాలిట.

నాలుక మీద వెంట్రుక వదలడంలేదు.

ఇది ఏడవ సమావేశం.

ఏడు సమావేశాలలో జరిగిందేమిటి? కోకకోలా ఖర్చు.

"నిరాశపడకూడదు.– ప్రతి పనికీ తక్షణ ఫలితం ఆశించరాదు– మన ప్రయత్నమంతా పత్రిక పురోభివృద్ధి గురించి అందరిని కలుపుకురావడం. ఆ దృష్టంటూ ఒకటి అలవాటయితే ఫలితాలు ప్రవాహాల్లా వస్తాయి"– అంటాడు ఎడిటర్.

చిన్నవాళ్ళను నోరు మెదపమంటూ – పెద్దవాళ్ళు నోరు మెదుపుతుంటారు.

అదీ క్వాలిటీ సర్కిల్‌లో సమానత్వం.


'ఏం చేస్తాం! ఈ చిన్నా పెద్దా జాఢ్యం ఈనాటిది కాదు. ఒక్కరోజులో పోదు' అంటాడు ఎడిటర్.

ఇంతకీ ఎడిటర్ మనసులో వున్నది ఏమిటి? పత్రిక పురోభివృద్ధా? ఫలితాలంటే ఏమిటి? పత్రిక పురోభివృద్ధా?

పురోభివృద్ధి అనగానేమి?

పత్రిక సర్క్యులేషన్ పెరుగుట. ధనమార్జించుట. ఉద్యోగుల జీతభత్తెములూ, జీవన స్థితిగతులూ వీలయితే మెరుగగుట.

నాలుక మీద వెంట్రుక వదలడం లేదు. అది క్షణ క్షణానికీ తనున్నానని గుర్తు చేస్తోంది. ఎక్కడుందో నా మర్యాదాపూర్వకమైన ప్రయత్నాలకు చిక్కడం లేదు.




ఇలా క్వాలిటీ సర్కిల్స్ నిర్వహణ గురించి సుమతికి చెప్పడం ఎందుకు?

** ** ** ** ** ** **

సుమతి తన ఎం.ఏ. డిగ్రీతో ఇంట్లో కూర్చుని, అన్నీ మర్చిపోయి టి.వి.లు చూసుకుంటూ, పత్రికలు చదువుకుంటూ, వంట చేసుకుంటూ గడిపేయక నేనేదో అవుకోలేక వాగిన వాటిని గురించి పట్టించుకోవడమేల? పద్నాలుగేళ్ళ నా కొడుకు చిట్టిరాజుగాడు వచ్చి వాళ్ళ అమ్మనే ఆ ప్రశ్నలు అడగడమేల? బిల్ క్లింటన్ గారు, మోనికా లెవెన్‌స్కీతో ఎక్కడో అమెరికాలో ఏదో చేశారు. మానవతా దృష్టితో చూస్తే, ఆ చేసిన దానికి వాళ్ళావిడ హిల్లరీగారు న్యాయంగా బాధపడాలి. మనిషి కావడంవల్లనే చేసిన తప్పు నేరమే అయితే దాన్ని విచారించడానికి, శిక్షించడానికి చట్టం వుంది. అమెరికా ప్రెసిడెంట్ కావడం ల్ల ఆయన మానవ సహజమైన తప్పొప్పులు చేయడానికి వీల్లేదా? అక్కడ క్లింటన్ చేసిన పని దాదాపు వ్యక్తిగతం. దాన్ని ఆయన కప్పెట్టుకోజూడడం మాత్రం ఏమంత ఘోరం? పబ్లిక్ ఫిగర్స్‌కి వ్యక్తిగత జీవితం వుండొచ్చా? లేదా? అన్న ధర్మ విచికిత్స ఈనాటిది కాదు. రాములవారే బాధపడ్డారు.

సరే! ఏదో అయింది. ఈ గొడవలో కుర్చీలోంచి క్లింటన్ దొరని లాగేయాలని తతిమ్మా దొరలు దారప్పోగు దొరికితే దాన్ని పేని పేని పెద్దది చేస్తుండవచ్చు గాక! ప్రపంచ పోలీసు ఇంట్లో కుర్చీ కోసం కుస్తీలు జరుగుతూ వుండొచ్చు గాక! ఇంత మర్యాద హీనంగా వాళ్ళు– నువ్వది ముట్టుకున్నావా? ముద్దెట్టుకున్నావా? అంటూ ఆ పడికారు మనిషి వలభయ్యో పడి రుగ్మతని బయటికి లాగి లాగి వినోదించవచ్చు గాక! ఆ టేపుల్నీ, పోజుల్నీ, మాటల్నీ– డెమాక్రసీ పేరుతో బహిరంగం చేయాలా? ఇది అమానుషత్వంలోకి రాదా? ఏమో! ఆ డెమొక్రటిక్ భోగజీవులకు అవి అమానుషంగా కనిపించకపోవచ్చు గాక! ఆ ఏడిపేదేదో వాళ్ళ పత్రికల్లో వేసుకుని, వాళ్ళ టి.వి.ల్లో చూపించుకుని, వాళ్ళ నెట్టుల్లో విడుదల చేసుకుని వాళ్ళ ప్రజాస్వామ్య ప్రదర్శనతో చంకలు గుద్దుకుంటే సరిపోదా?

లేదుట!

ఆ ప్రదర్శన ప్రపంచమంతా దర్శించి తరించాలిట! క్లింటన్ మగాడు గనక ఆడాళ్ళందరూ తిట్టాలిట! తమ మగాడు ఇలా వీథినపడేలా రహస్యాన్ని దాచలేకపోవటానికి మగాళ్ళు తిట్టాలిట.

ఇంతకీ– కుర్చీలోంచి పడిపోవడమూ, క్లింటన్ దొరని నలుగురూ తిట్టటమేనా? ఈ ప్రజాస్వామ్య ప్రదర్శకుల లక్ష్యం? క్లింటన్ దొర తప్పు చేసిందు గాని నీతి నియమాల అగ్నిగుండంలో పునీత అయిన అమెరికా దొరతనం 'ప్రపంచంలో కొట్లాది

మానవ ప్రాణుల ఆకలికన్నా, కన్నీళ్ళ కన్నా, దోపిడీ కన్నా లైంగిక నీతి కోసం కుర్చీ కోల్పోవడం మిన్న' అని నచ్చచెప్పటమా? ఈ విస్పష్ట ప్రదర్శన వెనుక నిశ్చిత లక్ష్యం? ఏమో! ఏమైతేనేం? ఇది దొర వారి దేవిడీ వ్యవహారం. ఇది ప్రపంచ దొరవారి దొరతనం.

ఈ దిక్కుమాలిన గోల నా చిట్టి రాజుని కొట్టించటమేల? అది విని సుమతి వాడిని తిట్టడమేల? కాళీపట్నం వారి 'యజ్ఞాన్ని' చదివిన సుమతి, సీతారామరాజు కొడుకును నరికినట్టు చిట్టిరాజుని బలిచ్చేది ప్రపంచానికి ఓ బుద్ధి చెప్పినట్టు కలగనటమేల? ప్రెస్సులో వుండి పొట్టపోసుకుంటున్న నేనేదో చేయగలనని, చేయాలని అనుకోనటమేల? అనుట ఏల? ఏల? ఏల? ఏల?

** ** ** ** ** చిట్టిరాజు గాడిది చురుకైన బుర్ర. పాదరసం. వాడు దొరికిందల్లా ఆసక్తిగా చదువుతాడు. తెలియనిదల్లా తెలుసుకో వచ్చునన్న నా శిక్షణను శిరసావహిస్తాడు. వాడి ప్రశ్నలను విని, వాడికొచ్చే మెచ్చికోళ్ళకి పులకించి సుమతి వాడి చురుకుదనానికి మరింత పదును పెంచింది. స్కూల్లో ప్రార్థనా కార్యక్రమం- తదనంతరం- వార్తా పఠనం- ఎన్నాళ్ళుగానో జరుగుతున్న ఆనవాయితీ కార్యక్రమాలు. అందులో మా చిట్టిరాజుకే ఎప్పుడూ ప్రశంసలు. చక్కని స్వరంతో, తప్పులు లేని ఆంగ్లంలో, స్పష్టమైన ఉచ్చారణతో వాడి వార్తా పఠనం ప్రధానోపాధ్యాయుల ప్రశంసలు పొందిన సందర్భాలు ఎన్నో వున్నాయి.



అలావాడు చదవగా భంగపడ్డ సందర్భాలు మాత్రం కొన్ని వున్నాయి. అందులో రెండు ముఖ్యమైనవి.

మొదటిది వాడు పత్రికలో వచ్చిన నక్సలైట్లు, పోలీసుల దుర్మరణం గురించి వార్తను చదివినప్పుడు. వాడు నన్ను ఎంతో ఆసక్తిగా అడిగి నక్సలిజం గురించి నోట్సు రాసుకుని వెళ్ళి చదివాడు.

అప్పుడు హెడ్ మాస్టర్ వాడిని తిట్టాడు గదిలోకి పిలిచి.

'నువ్విది ఎందుకు రాసుకొచ్చావ్?'

'ముఖ్య సమాచారం రాయాలి కదా సార్?'

'ఇది ముఖ్య సమాచారమని ఎలా అనుకున్నావ్?'

వాడు కాస్త ఆలోచించి-

'పేపర్లో పడ్డది కదా సార్! అంతమంది చనిపోవడం పెద్ద న్యూసే కదా సార్?'

'నీకు మీ నాన్న ఇదే చెప్పాడా? అమ్మ ఇదే చెప్పిందా?' వంటి ప్రశ్నలు కాని ఆశ్చర్యార్థకాలతో వాడిని మందలించాడు.

వాడు ఏడుపు మొఖం పెడితే జాలిపడి ఒక తరుణోపాయం చెప్పాడు.

'పేపర్లో మొదటి పేజీలో వచ్చినదే ముఖ్యవార్త' అని ఓ కొండ గుర్తు తెలిపాడు.

అలా మొదటిసారి తిట్లు తిన్న చిట్టిరాజు ఇంటికొచ్చి అమ్మ దగ్గర ఏడిచాడు.

మళ్ళీ ఇన్నాళ్ళకు వాడు చదివిన వార్తకు హెడ్మాస్టారు స్టేజీమీదే వాడి గూబ గుయ్యిమనిపించాడు. వాడి తెల్లని పాలబుగ్గ మీద ఆ చేతివేళ్ళ గుర్తులు చూసి మా ఆవిడ గుండెలు తరుక్కుపోయాయి.

ఇంతకీ వాడు చదివిన వార్త దాదాపు అన్ని పత్రికలలో మెయిన్ న్యూస్గా వచ్చిందే! అది ప్రపంచ దొరతనం వారి నిర్వాకమే! మోనికా దేవి శరీరం మీద క్లింటన్ దొర చేతులు ఏక్కడెక్కడ పడి ఏమి చేశాయో పత్రికలన్నింటిలో రసాత్మకంగా వివరించబడింది.

మా చిట్టిరాజులు ఆ వార్తే మోసుకెళ్ళి శాస్త్రీయంగా వివరించబోయేసరికి హెడ్మాస్టారుకి ఒళ్ళు తెలియలేదు. స్టేజీ మీదే చేయి చేసుకున్నాడు.

వాడొచ్చి కన్నతల్లి కదా అని చెప్తే తన వివరణలో ఏమైనా తప్పుందేమో తెలుసుకోబోయేదు. సుమతి వాడి నిస్సిగ్గు ప్రశ్నలకు ఇష్టం వచ్చినట్టు తిట్టింది.


ఆ తర్వాత వాడిని ఓదార్చబోయింది. కాని వాడు తన గదిలో దూరి బయటకురాలేదు. ఏడిచి, మొత్తుకుని, తలుపు తెరిపించి, బతిమాలి, బామాలి, తిండి పెట్టి వాడిని పక్కలో పడుకోబెట్టుకుని మగతలోకి జారిపోయింది.

అలా జారి అందులో ఓ కలను కంది. ఆ కలలో ఆవిడ ప్రధానమంత్రిని నేరుగా కలుసుకుంది.

"మీరు నీతి పోలీసులు కదా? ఇట్లాంటి వార్తలకు ఇంత ప్రచారం జరుగుతుంటే- ఈ వార్తను ఇంత వివరంగా ప్రెస్సు రాస్తుంటే మీకు చీమ కుట్టినట్టయినా లేదా?" అని నిలదీసిందట!

'ఏంచేస్తాం తల్లీ! మనం మానవమాత్రులం! నిమిత్తమాత్రులం! ఆ భగవంతుడి ఆలయ నిర్మాణానికే ఇన్ని ఆటంకాలు ఎదురవుతుంటే ఏం చేయాలో తెలియక జుత్తు పీక్కుంటున్న వాళ్ళం. ఆ సర్వం సహా చక్రవర్తి తలవు మాత్రం చేత చేయగలిగిన పనిని మేం తన్నుకున్నా చేయలేకపోతున్న వాళ్ళం. ఓ మధ్యతరగతి మహిళా! ఇంత నిమిత్తమాత్రులమైన మేము ఆ పెద్దదొరతనాన్ని ఆపగలమా! ఇంకేమయినా కోరుకో, అదొక్కటియుదక్క-" అన్నాడట ఆయన వినమ్రిత హస్తాలతో.

అప్పుడావిడ 'యజ్ఞం' కథలో సీతారాముడు




శ్రీరాములు నాయుడిని చూపినట్టు చూసి-

"నువ్వు చేస్తున్న పనివల్ల కంటికి కనపడకుండా జరుగుతున్నదేమిటో చూపిస్తాను-చూడు" అంటూ ఓ కత్తి తీసి తన బిడ్డను పొడిచేస్తుందట.

చిట్టిరాజు నిద్దట్లోంచి లేచి, అమ్మని లేపి బావురుమన్నాట్ట!

ఇంటికొచ్చాక నన్ను పట్టుకుంది మమతి.

'కనీసం ఏదో పని చేయండంది'.

'ఓ ఉత్తరం రాయి. పేపర్లో వేసేస్తాను. రేపే!' అన్నాను. నా చేతుల్లో వున్నది గనక.

'అలా మీరు చేతులు దులుపుకుంటే నేను ఒప్పుకోను. మీరు పత్రికలో అసిస్టెంటు న్యూస్ఎడిటర్! మీ ఎడిటర్తో చెబితే ఇక ముందయినా ఇంత ఘోరంగా రాయకుండా ఆపుతారేమో!' అంది.

అప్పటి నుంచీ నా నాలుక మీద వెంట్రుక భ్రాంతి మొదలయ్యింది.

** ** ** ** **

ఆరోజు బుధవారం కావడాన మా నాణ్యతా సర్కిల్ సమావేశం కూడా కలిసొచ్చింది.

కాని సమావేశం అభినందనలతో మొదలయ్యింది.

నిన్న వెలువడ్డ పేపర్లో మెయిన్ న్యూస్ని అంత రసవత్తరంగా రాసి నగ్న సత్యాలను నగ్నాతినగ్నంగా బయటపెట్టడంతో 'నెనుదీయని సంపాదకవర్గ నాయకుడవి' అభినందించి, ఆమీదట ఆ వార్త రాసిన ఉద్యోగిని కాస్త అసూయతో అందరూ పొగుడుతున్నారు.

'ఫోటోలు వేస్తే పత్రిక పురోభివృద్ధికి దోహదపడేవాళ్ళం'- అన్నాడొకడు.

ఎడిటర్ చాలా శ్రద్ధగా అతనివైపు చూసి నవ్వాడు.

"నేను చెప్పలేదూ! ఉమ్మడి సంపాదకత్వంలో మరింత మంచి ఆలోచనలు వస్తాయనీ- తప్పకుండా ఈసారి ఫోటోలు వేద్దాం'.

'కలర్వి అయితే మరీ బాగుంటాయి' అన్నది మరొక గొంతు.

నా నాలుక మీద వెంట్రుక భరించలేకుండా తయారయింది.

నోరు బాగా వెళ్ళబెట్టి, అన్ని వేళ్ళూ లోపలకి నెట్టి ఆ వెంట్రుకను పట్టుకునే ప్రయత్నం చేశాను. నా అవలక్షణ చేష్టకి అందరి దృష్టి ఒక్కసారిగా నామీద పడింది.

"ఏంటయ్యా నీ బాధ?" అన్నాడు ఎడిటర్.

చెప్పాను.

'బాత్రూమ్లోకి పోయి నోరు శుభ్రం చేసుకోవచ్చు కదా!' అన్నాడాయన.

'నిజమే కాని..!'

'చెప్పు, చెప్పు.'

'నే చెప్పేదానికి పత్రిక పురోభివృద్ధికి కూడా సంబంధముంది'.

'ఇంకేం! ఇది అసందర్భ ప్రసంగం కూడా కాదు, తప్పకుండా చెప్పు'.

'ఈ సభలోంచి పోకుండా లోపలున్న దాన్ని బయటకు తీసుకోగలననుకున్నాను, సాధ్యం కాలేదు. బాత్ రూమ్లోకి పోవచ్చు కూడా! కాని బాత్ రూమ్లో జరిగేది మాత్రం గోడలు చూడనేముంది? చూసి పనికొచ్చేటట్టయితే బయటకు లాగనేముంది?, లాగితే దానివల్ల కూడా పురోభివృద్ధి వుంటే పత్రికలు మోయననేముంది?' అన్నా.

'అయితే నీకు పత్రిక పురోభివృద్ధి ఇష్టం లేదా?' అన్నాడాయన.

'అయితే నీకు నాణ్యత పెంచడం ఇష్టం కాదా?' అన్నాడు అనుచర గణంలో ఒకాయన.

'అయితే నీకు జీత బత్తేల పెరుగుదలతో పని లేదా?' ఇంకొకరు..

'నీ వ్యక్తిగత జీవిత నాణ్యత, మెరుగవనవసరం లేదా?' వేరొకరు..

"లేదు..లేదు.. లేదు.. నాకు దేశం ముఖ్యం. నా బిడ్డలు ముఖ్యం, వారి మానసికారోగ్యం ముఖ్యం. వారి కనీసావసరాలు తీరటం ముఖ్యం. నాకు సామాజిక జీవిత నాణ్యత ముఖ్యం" అంటున్నాను. అరుస్తున్నాను, అరుస్తున్నట్టనుకుంటున్నాను.

ఎడిటర్ నవ్వుతో నాణ్యతా సమావేశానికి స్విచ్ నొక్కినట్టయింది. నవ్వులు-నవ్వులు-నవ్వులు బాణాల్లా తగులుతున్నాయి. అందులోనే వుండి వాటిని తప్పించుకొంటూ నా బాధ్యత నేను చేయాలో, వారితో కలిసి నా బాధ్యతను విడిచేయాలో లేక అందులోంచి బయటికి పోవాలో అర్థంకాక మెడకి ఉచ్చు బిగిస్తున్నట్టనిపించింది.

